సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 4 । జూలై । 2025




కల సాకారం

జూనియర్ కళాశాల బొంరాస్‌పేట మండల వాసులు కల. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో అది సాకారమైంది. 4లో▸



పీహెచ్‌సీకి ఒక్కరే డాక్టర్

వైద్యుల కొరతతో మోమిన్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. 4లో▸



హస్నా'బాధల్'!

గ్రామం ఒక్కటే.. ఆ గ్రామం మాత్రం రెండు మండలాల పరిధిలో కొనసాగుతోంది. ఇదీ హస్నాబాద్ పరిస్థితి. 5లో▸

న్యూస్‌రీల్

ప్రత్యేక బస్సు ప్యాకేజీ

తాండూరు టౌన్: రానున్న గురుపౌర్ణమిని పురస్కరించుకుని గానుగాపూర్‌లోని దత్తాత్రేయ స్వామి దర్శనార్థం వెళ్లనున్న భక్తుల కోసం తాండూరు ఆర్‌టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సు ప్యాకేజీని తీసుకొచ్చినట్లు డిపో మేనేజర్ సురేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9వ తేదీ సాయంత్రం 5గంటలకు తాండూరు బస్టాండ్ నుంచి బయలుదేరనున్న బస్సు కల్బుర్గిలోని శరణు బసవేశ్వర టెంపుల్ దర్శనానంతరం గానుగాపూర్‌కు చేరుకుంటుందన్నారు. 10వ తేదీన దత్తాత్రేయ స్వామి దర్శనానంతరం బయలుదేరి అదే రోజు సాయంత్రం 5గంటలకు తాండూరుకు చేరుకోనున్నట్లు తెలిపారు. స్పెషల్ ఎక్స్‌ప్రెస్ బస్సులో ప్రయాణించే ఒక్కో ప్రయాణికుని వద్ద రూ.700 చొప్పున చార్జీలు వసూలు చేయనున్నట్లు చెప్పారు. ప్రయాణికులు ముందస్తుగా తమ సీట్లను బస్ స్టేషన్‌కు వచ్చి బుక్ చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ల 9959226251, 9441717503, 8309348157లో సంప్రదించాలన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు పీఎస్ భవనాలకు భూమిపూజ



కొడంగల్‌లో పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి మార్కింగ్ వేయిస్తున్న సీఐ

కొడంగల్: నియోజకవర్గంలోని పలు మండల కేంద్రాల్లో శుక్రవారం పోలీస్ స్టేషన్ల నూతన భవన నిర్మాణాలకు భూమిపూజ చేయనున్నారు. కొడంగల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంతో పాటు కొడంగల్, దుద్యాల్, బొంరాస్‌పేట మండల కేంద్రాల్లో నూతన భవనాల నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. కొడంగల్‌లోని పాత పోలీస్‌స్టేషన్ స్థలంలో కొత్తగా నిర్మాణాలు చేపట్టనున్నారు. గురువారం మార్కింగ్ వేయించారు. భూమిపూజ కార్యక్రమానికి రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులతో పాటు పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి, జిల్లా అధికారులు హాజరవుతారని తెలిపారు.

సర్కారు వారి చేతి సంచులు!



రేషన్‌కార్డుదారుల చేతిబస్తా

బొంరాస్‌పేట: రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం త్వరలో చేతి బస్తాలు (క్యారీ బ్యాగులు) అందించనుంది. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రతీ కార్డుదారునికి ఒక్కో బ్యాగు చొప్పున ఇస్తారు. ఆరు గ్యారంటీల లోగో, దివంగత ప్రధాని ఇందిరాగాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల ఫొటోలతో ఉన్న ఈ హ్యాండ్ బ్యాగులు ఇప్పటికే స్టాక్ పాయింట్లకు చేరాయి. వారం రోజుల్లో వీటిని రేషన్ దుకాణాలకు పంపిస్తారు.



తాండూరు: పైప్‌లైన్ లీకేజీతో జలమయంగా మారిన రోడ్డు

జలం.. కలుషితం

పైప్‌లైన్ లీకేజీలతో సతమతం

తాగునీటి అవసరాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా ప్రజల దాహం మాత్రం తీరడం లేదు. మిషన్ భగీరథ, వాటర్ ట్యాంకులు, బోరు బావులు, నల్లా కనెక్షన్లు ఎన్ని ఉన్నా నిత్యం తాగునీటి కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్యలపై 'సాక్షి' ప్రత్యేక కథనాలు.

- గాడిన పడని తాగునీటి సరఫరా
- వర్షాలు పడుతున్నా మెరుగుపడని పరిస్థితి
- ప్రజల దాహం తీర్చని 'భగీరథ'
- ప్రైవేటులో కొనుగోలు చేస్తున్న జనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

వికారాబాద్: మున్సిపల్ పరిధిలో రోజు తప్పించి రోజు తాగునీరు సరఫరా అవుతోంది. లీకేజీల కారణంగా తాగునీరు కలుషితం అవుతుండటంతో 90శాతం ప్రజలు ఆ నీళ్లు తాగడంలేదు. దాదాపు 90శాతం అవసరాలకు మిషన్ భగీరథ పథకం తీరుస్తోంది. మిగతా లోటును బోరు బావులు, హ్యాండ్ పంపుల ద్వారా పూడుస్తున్నారు. పలుచోట్ల తరచూ పైప్‌లైన్లు లీకేజీలు అవుతున్నాయి. ఆయా ప్రాంతాల ప్రజలు అధికారుల దృష్టికి తెచ్చినా తక్షణం స్పందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మిషన్ భగీరథ పథకం పైప్‌లైన్‌కు అమర్చిన ట్యాప్‌లు, మీటర్లను చాలా వరకు ప్రజలు తొలగించారు. దీంతో తాగునీరు వృథాగా

- వికారాబాద్ మున్సిపల్ జనాభా 70 వేలు
- మొత్తం నివాసాలు 16వేలు
- నల్లా కనెక్షన్లు 10,600
- రోజుకు అవసరమైన తాగునీరు 14 ఎంఎల్‌డీ
- సరఫరా అవుతున్నది 10.4 ఎంఎల్‌డీ

పోతోంది. అంతేకాకుండా నల్లాల వద్ద నిలిచి నీటి సరఫరా ఆగిపోయిన తర్వాత పైపుల్లోకి చేరి కలుషితమవుతున్నాయి. మరుసటి రోజు వంద్రు నీరు వస్తోంది. దీంతో ఆ నీటిని ప్రజలు తాగడం లేదు. చాలా మంది బుబుల్స్ కొనుగోలు చేసి దాహం తీర్చుకుంటున్నారు.

10,600 నల్లా కనెక్షన్లు

వికారాబాద్ మున్సిపల్ పరిధిలో మొత్తం 16,000 ఆవాసాలు ఉండగా 70 వేల జనాభా నివసిస్తున్నారు. వీరికి మిషన్ భగీరథ నామ్స్ ప్రకారం రోజుకు ఒకరికి 100 లీటర్ల చొప్పున సరఫరా చేయాల్సి ఉంది. ఈ లెక్కన మున్సిపాలిటీకి రోజుకు 7 ఎంఎల్‌డీ (మిలియల్ లీటర్ ఫర్‌డే) నీళ్లు అవసరం. ప్రస్తుతం రోజు తప్పించి రోజు సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ పథకం కింద 14 ఎంఎల్‌డీ వాటర్ సరఫరా చేయాల్సి ఉండగా ప్రస్తుతం 10.4 ఎంఎల్‌డీ సరఫరా చేస్తున్నారు. మున్సిపల్ పరిధిలో 198 బోరు బావులు, 56 చేతిపంపులు ఉన్నాయి. నల్లాలు లేని చోట వాటిని వినియోగిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైనా భూగర్భ జలాలు పెరగలేదు. ఇది ప్రజల తాగునీటి అవసరాలపై ప్రభావం చూపుతోంది.

అరకొర సరఫరా



కొడంగల్ పట్టణ పరిధిలోని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్

కొడంగల్: మున్సిపల్ పరిధిలో 16వేలకు పైగా జనాభా ఉంది. పట్టణ శివారులోని సిద్దనొంపు వద్ద గల మిషన్ భగీరథ వాటర్ ట్రిట్‌మెంట్ ప్లాంట్ నుంచి నీటి సరఫరా జరుగుతోంది. సీఎం నియోజకవర్గం కావడంతో అధికారులు నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నా అక్కడక్కడ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మిషన్ భగీరథ పథకం నిబంధనల ప్రకారం నీటి సరఫరా జరగడం లేదనే అపవాదు ఉంది. మంచినీటి సరఫరా అరకొరగానే సరఫరా అవుతోందనే విమర్శలు వస్తున్నాయి. పాత కొడంగల్‌లో కొన్ని రోజులుగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని గ్రామస్తులు తెలిపారు. కొడంగల్‌తో పాటు విలీన గ్రామాల్లో అవసరం మేరకు నీటి సరఫరా కావడం లేదని తెలుస్తోంది. గతంలో కూళాయిల ద్వారా రెండు గంటల పాటు నీటి సరఫరా జరిగేది. ప్రస్తుతం గంటకు కుదించినట్లు స్థానికులు తెలిపారు.

తాగునీటికి తంటాలు



పరిగిలో ఆగిన ట్యాంక్ నిర్మాణ పనులు

పరిగి: మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు సరిపడా సరఫరా కాకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. మున్సిపల్ పరిధిలో 30వేలకు పైగా జనాభా ఉంది. వీరికి రోజుకు 4.5 ఎంఎల్‌టీ నీరు అవసరం. కానీ 3.5ఎంఎల్‌టీ నీటిని మాత్రమే సరఫరా చేస్తున్నారు. 15 ట్యాంకులు, 76 బోరు మోటార్లు అందుబాటులో ఉన్నాయి. 42 కిలోమీటర్ల పైప్‌లైన్ ఉంది. ఏడు నెలల క్రితం కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 కింది పరిగి మున్సిపాలిటీకి రూ.15 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో నాలుగు ట్యాంకులు, 10 కిలో మీటర్ల మేర పైప్‌లైన్ వేయాల్సి ఉండగా.. పనుల్లో ఎలాంటి ప్రగతి కనిపించడం లేదు.

సర్వం లీకేజీలమయం

తాండూరు: మున్సిపల్ పరిధిలో తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పట్టణ పరిధిలో 36 వార్డుల్లో 14,706 గృహాలు, 85వేల జనాభా ఉంది. వీరికి రోజుకు 12 ఎంఎల్‌డీ నీరు అవసరం కాగా 9 ఎంఎల్‌డీల నీటి మాత్రమే సరఫరా చేస్తున్నారు. మున్సిపల్ ప్రజల తాగునీటి అవసరాలను మిషన్ భగీరథ, కృష్ణా జలాలు, కాగ్నానది వద్ద గల రెండు పంప్‌హౌస్ తీరుస్తున్నాయి. పట్టణ పరిధిలో 14,706 ఇళ్లు ఉండగా 7,158 ఇళ్లకు మాత్రమే తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మరో రెండు వేల ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇచ్చినా ఇప్పటి వరకు సరఫరా చేయడం లేదు. 10 వాటర్ ట్యాంక్‌ల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. ఆరేళ్ల క్రితం తాండూరు మున్సిపాలిటీలో ఎన్‌టీఆర్ కాలనీ, రాజీవ్ కాలనీ, రసూల్‌పూర, కోకట్ రోడ్డు, గౌతాపూర్ శివారు ప్రాంతాలు కలిశాయి. ఇప్పటి వరకు ఆయా ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంది లేదు. వాటర్ ట్యాంక్ నిర్మించి ఏళ్లు గడుస్తున్నా ఇళ్లకు పైప్‌లైన్ వేసి ట్యాప్‌లు బిగించలేదు. దీంతో ట్యాంక్ అలంకార ప్రాయంగా దర్శనమిస్తోంది. 325 వరకు బోరు మోటార్లు, పంపులు ఉన్నా సగానికి పైగా కబ్జా చేసి వాడుకుంటున్నారు. 122 చేతిపంపులు ఉండగా కొన్ని మరమ్మతులకు నోచుకోవడం లేదు. పట్టణ ప్రజల దాహార్తి తీరుస్తున్న కాగ్నా నదిలోని పంప్‌హౌస్‌లు పాడయ్యే స్థితికి చేరాయి. పాత తాండూరులోని పంప్ హౌస్ పైప్‌లైన్‌కు లీకేజీలు ఏర్పడి నీరు కలుషితమవుతోంది. ఆ నీటిని తాగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో తాగునీరు వృథాగా పోతోంది.



మున్సిపల్ కార్యాలయం ఎదుట వృథాగా పోతున్న తాగునీరు

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

- ఎన్నికల హామీలు అమలు చేస్తున్నాం
- ఖర్గే సమావేశాన్ని విజయవంతం చేద్దాం
- స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధి.. సంక్షేమాన్ని సమాంతరంగా తీసుకెళ్తున్నారని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం వికారాబాద్‌లోని ఆయన నివాసంలో పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం హైదరాబాద్‌లో జరగనున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమావేశానికి జిల్లా నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ పెద్దలు రాష్ట్రాన్ని దివాళా తీయించారని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా సీఎం రేవంత్‌రెడ్డి సమర్థవంతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. అనంతరం చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ మాట్లాడారు. పార్టీ కార్యక్రమాలపై ఖర్గే దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత పార్టీ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఖర్గే సమావేశం చరిత్రలో నిలిచిపోనుందన్నారు. సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌టీఏ సభ్యుడు ఎర్రవల్లి జాఫర్, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ వైస్‌చైర్మన్ రమేష్‌కుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మైపాల్‌రెడ్డి, బ్లాక్ అధ్యక్షులు అనంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ నర్సింలు, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు రత్నారెడ్డి, సీనియర్ నాయకులు నరోత్తంరెడ్డి, రాంచంద్రారెడ్డి, వాహిద్‌మియా, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

పాలన నచ్చే పార్టీలోకి చేరికలు

మోమిన్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన నచ్చే పలువురు పార్టీలో చేరుతున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. గురువారం వికారాబాద్‌లో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలకు కట్టుబడి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్న రకం వడ్లకు బోనస్, కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించినట్లు పేర్కొన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. కొత్త రేషన్ కార్డుల పంపిణీ, యువ వికాసం తదితర పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు సుభాష్‌గౌడ్, ఎరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పక్కాగా ఉండాలి



బీఎల్‌ఓలకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

- బీఎల్‌ఓలు ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించాలి
- అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

కొడంగల్: బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటినీ సందర్శించి ఓటర్ల వివరాలను పరిశీలించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో నిర్వహించిన జాతీయ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓటరు జాబితాలో మార్పులు చేర్పులపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బీఎల్‌ఓలకు, సూపర్ వైజర్లకు ఒక్కరోజు శిక్షణ, అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఫారం 6, 7, 8 నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఓటరు జాబితాలో అవసరమైతే పాత ఫొటోలను తొలగించి కొత్త ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. పేర్లలో తప్పులు ఉంటే సవరించాలని సూచించారు. ఫారం 6 ద్వారా కొత్త ఓటర్లను నమోదు చేయాలని తెలిపారు. కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేలా చూడాలని ఆదేశించారు. మరణించిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలన్నారు. పేరు మార్పుల కోసం ఫారం 8 వినియోగించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంఈఓ రాంరెడ్డి, మాస్టర్ ట్రైనర్లు, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.



తుది దశకు చేరిన బ్రిడ్జి నిర్మాణ పనులు

చురుగ్గా బ్రిడ్జి నిర్మాణ పనులు

తాండూరు: పట్టణ పరిధిలోని తాండూరు – కొడంగల్ మార్గంలో చిలుక వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. చిలువ వాగు ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం ఐదు నెలల క్రితం దాదాపు రూ.16 కోట్లు మంజూరు చేసింది. ఇందులో భాగంగా శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి పునర్నిర్మాణ పనులు చేపట్టారు. వర్షాలు పడేలోపు పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆదేశించడంతో పనులు వేగం పుంజుకున్నాయి. ప్రస్తుతం బ్రిడ్జి పనులు 70శాతం మేర పూర్తయ్యాయి. ఈ వంతెన అందుబాటులోకి వస్తే మార్కెండేయ కాలనీ, టీచర్స్ కాలనీ, ఆదర్శ నగర్, తులసీ నగర్, సాయిపూర్ కాలనీకు మేలు చేకూరుతుంది. అంతేకాకుండా వాహనాల రాకపోకలకు సులభతరం అవుతుంది. మరో వారం రోజుల వ్యవధిలో బ్రిడ్జి పైనుంచి రాకపోకలు సాగించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పూర్తిస్థాయి వర్షాలు పడకముందే బ్రిడ్జి నిర్మాణం పూర్తి కానుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అరుణాచల క్షేత్రానికి ప్రత్యేక బస్సు సౌకర్యం

షాద్‌నగర్‌రూరల్: గురు పౌర్ణమిని పురస్కరించుకొని తమిళనాడులోని అరుణాచల క్షేత్రానికి వెళ్లే భక్తులకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించనున్నట్టు డీఎం ఉష తెలిపారు. డిపో కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ.. అరుణాచలంలో ఈనెల 10న గిరి ప్రదక్షిణ చేయాలనుకునే భక్తులకు సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ నెల 8న రాత్రి 7 గంటలకు షాద్‌నగర్ నుంచి బయలుదేరి 9న ఉదయం 6గంటలకు కాణిపాకం చేరుకుంటుందని, దర్శనానంతరం అక్కడి నుంచి బయలుదేరి సాయంత్రం 4 గంటలకు వెల్లూరులోని గోల్డెన్ టెంపుల్‌కు చేరుకుంటుందన్నారు. అక్కడి నుంచి బయలుదేరి అదే రోజు రాత్రి అరుణాచల క్షేత్రానికి చేరుకుంటుందని వివరించారు. 10న గిరిప్రదక్షిణ పూర్తయిన తరువాత సాయంత్రం 4 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 11న ఉదయం 5గంటలకు షాద్‌నగర్ డిపోకు చేరుకుంటుందని పేర్కొన్నారు. టికెట్ ధర పెద్దలకు రూ.3,600, పిల్లలకు రూ.2,400 నిర్ణయించడం జరిగిందన్నారు. టికెట్ బుకింగ్ కోసం 94409 19113, 94900 21433, 91826 45281, 99592 26287 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

- 15 రోజులుగా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన
- బోర్లకు మరమ్మతులు చేపట్టాలని వినతి

పరిగి: గుక్కెడు నీటి కోసం నానా అవస్థలు పడుతున్నామని, అయినా మా బాధలు పట్టించుకునే నాథులే లేరని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పరిగి మండలం బర్కత్‌పల్లికి చెందిన పలువురు ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదిహేను రోజుల నుంచి తాము నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. గ్రామంలోని బోర్లు చెడిపోయినా బాగు చేయించడం లేదని తెలిపారు. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి, నాయకుల దృష్టికి తెచ్చినా పట్టించుకోలేదని ఆరోపించారు. దీంతో రోడ్డెక్కాల్సి వచ్చిందని వివరించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకొని నిరసన తెలిపారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే పాలకు ప్రజల సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓను కలిసి వినతిపత్రం అందజేశారు.



ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

సర్దార్‌నగర్‌ను సందర్శించిన తమిళనాడు బృందం



పంచాయతీ కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న తమిళనాడు బృందం

షాబాద్: మండలంలోని సర్దార్‌నగర్ గ్రామాన్ని తమిళనాడు బృందం గురువారం సందర్శించింది. గ్రామ పరిపాలన, పౌరసేవలు, వివిధ పథకాల అమలు బాగుందని కితాబిచ్చింది. ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ ద్వారా సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్‌శిక్షణ బృందం అనిల్‌కుమార్, వెంకటరమణ తమిళనాడు సర్పంచులు, బ్లాక్ అధ్యక్షులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారుల బృందంతో కలిసి గ్రామంలో సౌకర్యాలు, వనరులు, అభివృద్ధిని పరిశీలించారు. అనంతరం పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. పంచాయతీ భవనం, గ్రంథాలయం, క్రీడా ప్రాంగణం, సెగ్రిగేషన్ షెడ్, పల్లె ప్రకృతి వనాలను సందర్శించారు.

క్లుప్తంగా

బాలికలను వేధిస్తే జైలుకే

- తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి
- చట్టాలపై విద్యార్థులకు అవగాహన



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు రూరల్: పాఠశాలలు, కళాశాలల వద్ద బాలికలను వేధిస్తే జైలుకు పంపిస్తామని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని జినుగుర్తి గేటు వద్ద ఉన్న మోడల్ స్కూల్ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు బాల్యం నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కష్టపడి చదివి, ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. బాలికలను వేధిస్తే పోక్సో చట్టం కింద జైలుకు పంపిస్తామన్నారు. మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ నగేష్, ఎస్ఐ విఠల్‌రెడ్డి, ప్రిన్సిపల్ శ్రీదేవి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఏఎంసీ డైరెక్టర్ మృతి



భగవాన్ కరీం (ఫైల్)

తాండూరు రూరల్: గుండెపోటుతో మండలంలోని అంతారం అనుబంధ గ్రామం దస్తగిరిపేట్‌కు చెందిన తాండూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ భగవాన్ కరీం(60) మృతి చెందారు. ఈ సంఘటన గురువారం కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లాలో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. భగవాన్ కరీం తన సోదరి అంత్యక్రియల కోసం కర్ణాటకకు వెళ్లారు. అక్కడే ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే అతన్ని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని స్వగ్రామం దస్తగిరిపేట్‌కు తరలించారు. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ బాల్‌రెడ్డితో పాటు డైరెక్టర్లు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

బైండోవర్‌లో ఉన్న వ్యక్తికి రిమాండ్



బైండోవర్‌లో ఉన్న వ్యక్తికి రిమాండ్ విధిస్తున్న తహసీల్దార్

పరిగి: మండల పరిధిలోని సాలిప్పలబాటతండాకు చెందిన డెగావత్ నీల్యానాయక్ గత 6 నెలల క్రితం సారా తయారీ చేస్తుండగా ఆబ్కారీ పోలీసులు పట్టుకున్నారు. ఆయన్ని పరిగి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి మళ్లీ సారా తయారు చేయరాదని హెచ్చరించారు. అయి నా అతనిలో మార్పు రాకుండా నిత్యం అదే పనిగా సారా తయారీ చేస్తున్నాడు. దీంతో గురువారం తహసీల్దార్ ఆనంద్‌రావు బైండోవర్‌ను ఉల్లంఘించినందుకు రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు. బైండోవర్‌లో ఉన్న వ్యక్తులు నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి



సీజ్ చేసిన వాహనాలతో ఆర్టీఓ వీరేంద్రనాయక్

కుల్కచర్ల: ట్యాక్స్ ప్లేట్ గల వాహనదారులు తమ వాహనాల పన్నులను తప్పనిసరిగా సకాలంలో చెల్లించాలని పరిగి ఆర్టీఓ వీరేంద్ర నాయక్ సూచించారు. గురువారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో ఐదు వాహనాలను సీజ్ చేశారు. వాటిపై రూ.లక్ష 10వేల ట్యాక్స్ ఉందని తెలిపారు. అనంతరం వాహనాలను కుల్కచర్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వీరేంద్రనాయక్ మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా తమ వాహనదారులకు ఉన్న ట్యాక్స్‌ను చెల్లించాలని, నిబంధనలను అనుసరించి నడపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

కాచిగూడ: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ నరేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాచిగూడ, కృష్ణానగర్ నాలాలో గుర్తుతెలియని వ్యక్తి (45) మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల సాకారం

మండల కేంద్రంలో జూనియర్ కళాశాల నిర్వహణ

- ఏళ్ల నిరీక్షణకు తెరదించిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

బొంరాస్‌పేట: మండల వ్యవస్థ ప్రారంభమైన నాటి నుంచి బొంరాస్‌పేటవాసులు కలలుగంటున్న జూనియర్ కళాశాల ఏర్పాటు సీఎం రేవంత్ రెడ్డి చొరవతో సాకారమైంది. ఇప్పటివరకు మండలంలోని విద్యార్థులు ఇంటర్ విద్యకు పొరుగు పట్టణాలకు పరుగులు తీశారు. చుట్టుపక్కల ఉన్న కొడంగల్, తాండూరు, పరిగి, వికారాబాద్ పట్టణాలకు ఇంటర్మీడియెట్ కోసం వెళ్లక తప్పలేదు. కానీ ఈ ఏడాది మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంఎల్‌టీ (మెడికల్ ల్యాబరేటరీ టెక్నీషియన్), ఎంపీహెచ్‌డబ్ల్యూ (మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్స్) గ్రూపులను అందుబాటులోకి తెచ్చారు. తెలుగు, ఆంగ్లం మాధ్యమాల్లో బోధనకు శ్రీకారం చుట్టారు. దీంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జూనియర్ కళాశాల వివరాలు

గ్రూపు	ఫస్టియర్	సెకండియర్
ఎంపీసీ	13	0
బైపీసీ	40	3
సీఈసీ	19	1
హెచ్ఈసీ	4	4
ఎంఎల్‌టీ	15	లేదు
ఎంపీహెచ్‌డబ్ల్యూ	24	లేదు

మొత్తం విద్యార్థుల సంఖ్య 123

వసతుల కల్పన

మండల కేంద్రం శివారులో తుంకిమెట్ల బ్రిడ్జి వద్ద ప్రస్తుతం జెడ్పీహెచ్ఎస్ ఆవరణలోని అదనపు తరగతి గదుల్లో జూనియర్ కళాశాల కొనసాగుతోంది. జెడ్పీహెచ్ఎస్ అదనపు గదుల సముదాయంలో జీయూపీఎస్ అదనపు గదుల భవనంలో ఇంటర్ విద్యార్థులకు బోధన జరుగుతోంది. భవిష్యత్తులో నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, అధ్యాపకులు కోరుతున్నారు.



మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల

సిద్ధంగా అధ్యాపక బృందం

కళాశాల అధ్యాపకులుగా ఆంగ్లం, కామర్స్ రెగ్యులర్ లెక్చరర్‌లున్నారు. కెమెస్ట్రీ, బాటనీ, ఫిజిక్స్, జువాలజీ, మ్యాథ్స్, సివిక్స్, ఎకనామిక్స్, హిందీ సబ్జెక్టులకు అతిథి అధ్యాపకులున్నారు. గతేడాది ప్రారంభమైన ఈ జూనియర్ కళాశాల విద్యార్థుల సంఖ్య అంతగా లేకపోవడంతో నిరుడు పరిగిలోనే నిర్వహించారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ ద్వితీయ, ప్రథమ సంవత్సరాల విద్యార్థులతో కళాశాల నిర్వహణ జరుగుతోంది. జూనియర్ కళాశాల ప్రవేశాల గడువు ఈనెల చివరి వరకు ఉంటుందని ఇంటర్ బోర్డు ఆదేశాలున్నాయి. ఇప్పటివరకు ఈ విద్యాసంవత్సరంలో 123 మంది విద్యార్థులున్నారు.



తరగతుల బోధన

నా కూతురుని చేర్పించా



నా కూతురు మంచి మార్కులతో పదో తరగతి పాసై ప్రైవేట్ కళాశాలలో చేరింది. ఇక్కడే కాలేజ్ ఉండటంతో చేరేందుకు ఆసక్తి చూపింది. విద్యా బోధన మెరుగ్గా ఉండడంతో అధ్యాపకులతో మాట్లాడి కళాశాలలో చేర్పించాను.

– యాదయ్య, విద్యార్థిని తండ్రి, బొంరాస్‌పేట

కల నెరవేరింది



ఇదివరకు పదో తరగతి వరకే చదివి మానేసిన దుస్థితి ఉంది. దాన్నుంచి బయటపడటానికి కాలేజీ ఏర్పాటు ఉపయుక్తం. సీఎం రేవంత్ చొరవనే ఇంటర్‌విద్య కల నెరవేరింది. రూ.3.50 కోట్ల నిధులతో కొత్త భవనం నిర్మాణంలో ఉంది.

– రాంచంద్రారెడ్డి, విద్యావంతుడు, బొంరాస్‌పేట

ఆసక్తి చూపుతున్నారు



జూన్ 2 నుంచి ప్రచారం చేశాం. 16 నుంచి బోధన, 23 నుంచి ఒకేషనల్ తరగతుల ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు ప్రవేశం పొందిన విద్యార్థులందరికీ పుస్తకాలు అందిస్తున్నాం. సామగ్రి సైతం అందాయి.

– దినేశ్, ఎఫ్ఏసీ, జీజేసీ, బొంరాస్‌పేట

తప్పుల్లేకుండా ఓటరు నమోదు

ఆర్డీఓ వాసుచంద్ర

దోమ: ఓటరు నమోదు, జాబితా తయారీలో బీఎల్వోలు బాధ్యతయుతంగా వ్యవహరించి తప్పులు లేకుండా చేపట్టాలని ఆర్డీఓ వాసుచంద్ర సూచించారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ గోవిందమ్మ బీఎల్వోలకు నిర్వహించిన ఓటరు నమోదు శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 2025లో భాగంగా కొత్త ఓటర్ల నమోదు, ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, ఇతర మార్పులు, చేర్పుల ప్రక్రియను కొనసాగిస్తుందని చెప్పారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కును కల్పించేందుకు బీఎల్వోలు చర్యలు తీసుకోవాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోటీ చేసే అభ్యర్థులు, ఓటు వేయాలనుకునే వారికి కొత్త ఓటర్లను నమోదు చేయించేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, నూతన ఓటర్లు నమోదు చేసుకునేందుకు చొరవ తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో డెత్ ఓటర్లను తొలగించి, తప్పులు లేకుండా జాబితాను తయారు చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎల్ఎంటీ శ్రీనివాస్, రాజేశ్ రాథోడ్, ఎలెక్షన్ డీటీ అనిల్, డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు, ఆర్ఐలు సుదర్శన్, రాంచందర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ పర్వేజ్, జూనియర్ అసిస్టెంట్లు యాదయ్య, శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది, బీఎల్వోలు, పాల్గొన్నారు.



బీఎల్వోలతో ఆర్డీఓ వాసుచంద్ర



మోమిన్‌పేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పీహెచ్‌సీకి ఒక్కరే డాక్టర్

- పేదలకు సకాలంలో అందని వైద్యం
- పట్టించుకోని అధికారులు

మోమిన్‌పేట: వైద్యుల కొరతతో మోమిన్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. కేంద్రంలో ముగ్గురు డాక్టరు ఉండాల్సి ఉండగా.. కేవలం ఒక్కరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. రోజుకు 100కు పైగానే బయటి రోగులు వస్తుంటారు. మోమిన్‌పేట, మర్పల్లి, కోటపల్లి మండలాలకు చెందిన గ్రామాల ప్రజలు అత్యవసరమై ఈ పీహెచ్‌సీనే సంప్రదిస్తారు. అలాంటి ఆస్పత్రిలో కేవలం ఒక్క డాక్టరు మాత్రమే విధులు నిర్వహిస్తే ఎలా అని మండలప్రజలు ప్రశ్నిస్తున్నారు. గతంలో ప్రభుత్వం ముగ్గురు వైద్యులను నియమించింది. కానీ ఉన్నతాధికారులు డిప్యూటేషన్ పేరుతో ఇతర వైద్యశాలలకు పంపించారు. డిప్యుటేషన్‌లను రద్దు చేయడంతో ఇద్దరు డాక్టర్లు సుజల, రషీద్ విధులు నిర్వహిస్తూ వచ్చారు. ఆ తర్వాత డా.బుచ్చిబాబును నియమించారు. కొన్ని రోజులకు డిప్యూటేషన్‌పై బుచ్చిబాబు, రషీద్‌లను పంపించారు. దీంతో కథ మొదటికి వచ్చింది.

ఇద్దరిని పంపారు

సుజల మాత్రమే డాక్టరుగా విధులు నిర్వహిస్తున్నారు. రోగులకు కొన్ని నెలలు సవ్యంగానే వైద్యం అందింది. కానీ ఉన్నతాధికారులు తాత్కాలిక డిప్యూటేషన్ అంటూ డాక్టరు రషీద్‌ను జీనుగుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, బుచ్చిబాబును డీఎంహెచ్ఓ కార్యాలయానికి పంపారు. ఒక నెల అని చెప్పి అక్కడే విధులు నిర్వహించాలని పేర్కొన్నట్లు తెలిసింది. ఆస్పత్రిలో ఒక్కరే విధులు నిర్వహించడంతో రోగులకు సరైన వైద్యం సకాలంలో అందడం లేదంటున్నారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందాలంటే వెంటనే డిప్యూటేషన్‌పై వెళ్లిన డాక్టర్లను తిరిగి రప్పించాలని, అందుకు ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

షాద్‌నగర్‌రూరల్: రైలులో నుంచి జారిపడిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం సోలీపూర్ శివారులోని రైల్వే బ్రిడ్జి సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఐజాక్ కథనం ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి(50) ఓ రైలు నుంచి జారి పట్టాల పక్కన ఉన్న రైల్వే కల్వర్టులోని చెట్ల పొదల్లో పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయాన్ని తెలుసుకున్న మహబూబ్‌నగర్ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఐజాక్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వివరాలు తెలియరాలేదు. మృతుడి శరీరంపై తెలుపు రంగు పూల షర్టు, గ్రే కలర్ ప్యాంటు, మెడలో తాయిత్త ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసినా, ఆచూకీ లభించినా వెంటనే 9848090426 ఫోన్ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. షాద్‌నగర్ స్టేషన్ మాస్టర్ ఠాగూర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఐజాక్ తెలిపారు.

నిబంధనలు అతిక్రమించొద్దు

యాచారం: హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం కుర్మిద్ద–మీర్‌ఖాన్‌పేట గ్రామాల మధ్యన రహదారిపై వాహనాల తనిఖీలు చేపట్టారు. సీఐ లిక్కి కృష్ణంరాజు రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. కార్లు, ఇతర వాహనాల్లో ఏం తరలిస్తున్నారో పరిశీలించారు. వాహనాలు నడిపే వారు, ఆర్‌సీ, లైసెన్స్‌లు కలిగి ఉండాలని సూచించారు. అతి వేగంతో ప్రమాదాలకు గురి కావద్దని చెప్పారు. రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐ తేజంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

- ట్రాన్స్‌ఫార్మర్ కింద ఇరుక్కుపోయిన చెప్పును తీస్తుండగా ప్రమాదం
- తాండూరు మండలం ఎల్మకన్నెలో ఘటన
- మృతదేహంతో బాధితుల ఆందోళన



ముజాయిద్ మృతదేహం

తాండూరు రూరల్: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతిచెందాడు. తాండూరు మండలం ఎల్మకన్నెలో గురువారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. ఎల్మకన్నె గ్రామానికి చెందిన సయ్యద్ ముజాయిద్(40) తన ఎకరా పొలంలో వ్యవసాయంతో పాటు చిన్నచిన్న కరెంట్ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలానికి చెందిన గోపాల్ రాథోడ్‌కు ఎల్మకన్నె శివారులో ఓ ఫాంహౌస్ ఉంది. ఇందులో మామిడితోట సాగు చేస్తున్నాడు. బుధవారం రాత్రి ఫాంహౌస్‌కు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. ఈ విషయం తెలుసుకున్న యజమాని గురువారం ఉదయం ముజాయిద్‌ను తీసుకురావాలని తన వద్ద పని చేసే నర్సింలును పంపించాడు. ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేసి, ఫ్యూజ్ వైర్ వేసిన అనంతరం ముజాయిద్ కిందకు దిగాడు. ఈక్రమంలో అతని చెప్పు ట్రాన్స్‌ఫార్మర్ కిందిభాగంలో ఎర్తింగ్ పట్టీ కింద ఇరుక్కుపోయింది. విద్యుత్ సరఫరా పునరుద్ధరించిన అనంతరం ముజాయిద్ ఓ కట్టె సాయంతో తన చెప్పును తీసుకునే ప్రయత్నం చేస్తుండగా.. 11కేవీ జంపర్ తగిలి ఒక్కసారిగా కిందపడిపోయాడు. అపస్మారక స్థితికి చేరుకున్న అతన్ని పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.



మృతదేహంతో ఫాంహౌస్‌లో బైఠాయించిన బంధువులు, గ్రామస్తులు

మృతదేహంతో బైఠాయింపు..

ఫాంహౌస్ యజమాని నిర్లక్ష్యం కారణంగానే ముజాయిద్ చనిపోయాడని ఆరోపిస్తూ అతని బంధువులు, గ్రామస్తులు మృతదేహంతో ఆందోళన చేపట్టారు. సుమారు 5గంటల పాటు ఫాంహౌస్‌లో నిరసన తెలిపారు. మృతునికి భార్య ఫర్వీన్ బేగం, కుమారులు ముస్తాఫా, సమీర్, కుతూరు సిమ్లా ఉన్నారు. ఫర్వీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

యజమాని నిర్లక్ష్యం..

కళ్లముందే కరెంట్‌షాక్‌కు గురై కింద పడిపోయిన ముజాయిద్‌ను ఆస్పత్రికి తరలించడంలో ఫాంహౌస్ యజమాని నిర్లక్ష్యంగా వ్యవహరించాడని బాధితులు, స్థానికులు ఆరోపించారు. అక్కడే ఉన్న అతని కారులో ఆస్పత్రికి తీసుకెళ్తే బతికేవాడని మండిపడ్డారు. అలా కాకుండా గ్రామంలోకి వెళ్లి ఆటో తీసుకువచ్చి, ఆస్పత్రికి వెళ్లేసరికి చాలా ఆలస్యమైందని బాధితులు వాపోయారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటండి

కొడంగల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని హరిత సేన జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. గురువారం పట్టణంలోని ఓ పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. మొక్కలు మానవ మనుగడకు జీవనాధారమన్నారు. రానున్న తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలంటే మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నరేష్‌రాజ్, నాయకులు వెంకటయ్య, మల్లేష్, సంతోష పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

గాడితప్పిన పల్లెపాలన

- జిల్లాలో నిధులు లేక అభివృద్ధికి నోచుకోని గ్రామాలు
- ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ కరువు
- పనిభారంతో ఇబ్బందులు పడుతున్న పంచాయతీ కార్యదర్శులు
- పల్లె ప్రకృతివనాల పరిస్థితి అధ్వానం



షాబాద్ ఎస్సీ కాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

షాబాద్: ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాలు అస్తవ్యస్తంగా మారాయి. పంచాయతీల్లో డబ్బులు లేక, ప్రభుత్వం నుంచి నిధులు ఇవ్వకపోవడంతో అభివృద్ధి కుంటు పడుతుంది. గతేడాది జనవరి 31తో గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది. అప్పటి నుంచి జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. గ్రామ పంచాయతీల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు లేకపోవడంతో వీధి దీపాలు, బోర్ల మరమ్మతులు, పంచాయతీ ట్రాక్టర్లకు డీజిల్ కొనేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగులకు సైతం జీతాలు చెల్లించలేని స్థితిలో పంచాయతీలున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడి పంచాయతీ కార్యదర్శులపై పనిభారం పెరిగింది. పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేయడంతో పాటు సరైన నిర్వహణ లేక పల్లెప్రకృతి వనాలు, వైకుంఠధామాల పరిస్థితి అధ్వానంగా మారింది.

పంచాయతీ కార్యదర్శులపై పనిభారం

జిల్లా వ్యాప్తంగా చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, కల్వకుర్తి, మహేశ్వరం, రాజేంద్రనగర్ నియోజకవర్గాల పరిధిలోని 21 మండలాల్లో మొత్తం 526 గ్రామ పంచాయతీలున్నాయి. 16 నెలల క్రితం గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది. ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా ప్రత్యేకాధికారుల పాలన కొనసాగిస్తున్నది. దీంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ అంతంతా మాత్రంగానే ఉండడంతో పంచాయతీ కార్యదర్శులపై పనిభారం పెరిగింది. వనమహోత్సవం, ఉపాధిహామీ, పల్లెప్రగతి, ఇంటి పన్నుల వసూలు, పారిశుద్ధ్యం తదితర పనులతో పంచాయతీ కార్యదర్శులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గ్రామ పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో చెత్త సేకరణ ట్రాక్టర్ల నిర్వహణ భారంగా మారింది. పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ నిధులు రాకపోవడంతో పెద్ద సమస్యగా మారింది. ఒక్కో గ్రామ పంచాయతీలో వివిధ పనులు చేపట్టడానికి రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్నామని కార్యదర్శులు వాపోతున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ



గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా ఉండేలా పంచాయతీ కార్యదర్శులతో ప్రతీవారం సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నాం. వర్షాకాలంలో వచ్చే సీజన్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాం. పెండింగ్ బిల్లులు ఉన్నప్పటికీ పారిశుద్ధ్య నిర్వహణలో జాప్యం లేకుండా చూస్తున్నాం.

– అపర్ణ, ఎంపీడీఓ, షాబాద్

వర్షాకాలం ప్రారంభంలోనే గ్రామాల్లో పల్లెప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమం ద్వారా పారిశుద్ధ్య పనులు చేపట్టేవారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ద్వారా ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించేవారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారింది. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యంతో వ్యాధుల ముప్పు పొంచి ఉందని ప్రజలు వాపోతున్నారు.

దళితులపై దాడులను ఆపాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్ రాములు

అనంతగిరి: జిల్లాలో దళితులపై జరుగుతున్న దాడులను ఆపాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్ రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వికారాబాద్‌లోని సీఐటీయూ కార్యాలయంలో కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సీఐటీయూ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం దళితులపై జరుగుతున్న దాడులపై ప్రత్యేక విచారణ చేపట్టి మరోసా ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. దాడులకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. దళితుల హక్కులను కాపాడానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, మైపాల్, శ్రీనివాస్, చంద్రయ్య, నవీన్‌కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన వివిధ సంఘాల నాయకులు

మరో స్వదేశీ ఉద్యమం చేపట్టాలి

స్వదేశీ జాగరణ మంచ్ విభాగ్ కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి

తాండూరు టౌన్: దేశంలో మరో స్వదేశీ ఉద్యమం చేపట్టాల్సిన అవసరముందని స్వదేశీ జాగరణ మంచ్ విభాగ్ కన్వీనర్ టి. ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో స్వదేశీ వస్తువుల వినియోగం, ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్ మూడో అతి పెద్ద ఆర్థిక దేశంగా ఎదగాలంటే మన దగ్గర తయారైన ఉత్పత్తులను అందరూ వినియోగించాలన్నారు. ఫ్లిఫ్‌కార్ట్, అమెజాన్, స్విగ్గి, జొమాటో వంటి విదేశీ ఆన్‌లైన్ కంపెనీల్లో ఆర్డర్లు చేయకుండా స్వదేశీ వ్యాపారుల వద్ద కొనుగోలు చేయాలన్నారు. బడా మాల్స్‌లో కాకుండా మన ప్రాంతంలోని చిన్న దుకాణాల్లో వస్తువులను కొనాలన్నారు. దీనివల్ల స్వదేశీ వస్తువుల ఉత్పత్తి పెరిగి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, వ్యాపారులు ఆర్థికంగా ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నరేష్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి